సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం। 8। ఫిబ్రవరి। 2023



బాధ్యతగా ఓటరు నమోదు

కొత్త ఓటరు నమోదు ప్రక్రియపై బాధ్యతగా చేపట్టాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచించారు. 10లో



ఒడిశా అధికారులు పొల్లూరు జలపాతం సందర్శన 10లో

ఒడిశాకు చెందిన అధికారుల బృందం పొల్లూరు జలపాతాన్ని సందర్శించింది.



ఐసీటీసీ విభాగం తనిఖీ

జాతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పాంజలి స్వైన్ ఐసీటీసీ విభాగాన్ని తనిఖీ చేశారు. 10లో

2,93,720 కార్డుదారులకు ఉచిత బియ్యం



పాడేరులోని నీలకంఠనగర్‌లో ఉచిత బియ్యాన్ని పొందుతున్న రేషన్ కార్డుదారులు

- అంత్యోదయ 61,446..
- తెల్ల రేషన్ కార్డులు 2,32,274
- 5,356.94 మెట్రిక్ టన్నుల సరఫరా
- పేదలకు ఆసరాగా పథకం

సాక్షి,పాడేరు: ఉచిత బియ్యం పంపిణీతో జిల్లాలో 2,93,720 కార్డులకు లబ్ధి చేకూరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న వాహనాల ద్వారా ఇంటింటికీ ఉచిత బియ్యం పంపిణీ చేస్తోంది. జిల్లాలోని 22 మండలాల్లో అంత్యోదయ పథకానికి సంబంధించి 61,446, తెల్ల రేషన్ కార్డులు 2,32,274 ఉన్నాయి. వీటిద్వారా మొత్తం 2,93,720 కార్డుదారులు లబ్ధి పొందుతున్నారు. కార్డుదారుల్లో ఒకొక్క సభ్యుడికి 5 కిలోల చొప్పున పంపిణీ జరుగుతోంది. ఇందుకు సంబంధించి పౌరసరఫరాలశాఖ 5,356.94 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాకు సరఫరా చేస్తోంది. పథకం, ప్రభుత్వ ఆశయం నెరవేరేలా పౌరసరఫరాలశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తూకంలో ఎటువంటి తేడాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యతగా ఉండటంతో ప్రజలు వీటిని వినియోగిస్తున్నారు. పాలిష్ లేని నాణ్యమైన బియ్యం కావడంతో అనారోగ్య సమస్యలతో బాధపడే వారు కూడా వీటినే వినియోగిస్తున్నారు.

పేదలకు ఎంతో మేలు



రేషన్ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి ఉచితంగా పంపిణీ చేయడంతో ఎంతో మేలు జరుగుతోంది. బియ్యం కూడా నాణ్యంగా ఉండడంతో కుటుంబ సమేతంగా వాటినే వినియోగిస్తున్నాం.

– కొర్రా చిన్నయ్య, తెల్లరేషన్‌కార్డుదారుడు, గరుడాపల్లి, హుకుంపేట మండలం

పారదర్శకంగా పంపిణీ



జిల్లాలో ఉచిత రేషన్ బియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతోంది. గత నెలలో ఇంటింటికి ఉచిత బియ్యం పంపిణీ విజయవంతమైంది. పౌరసరఫరాల అధికారులు పంపిణీని నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

– శివశ్రీనివాస్, జాయింట్ కలెక్టర్, పాడేరు

గిరి పల్లెలో విషాదం

- భర్త కొట్టాడని భార్య ఆత్మహత్య
- ఆమె మృతిని తట్టుకోలేక భర్త బలవన్మరణం
- కలిగుండం గ్రామంలో ఘటన



సమ్మక్క, భద్రయ్య మృతదేహాలు

చింతూరు: మండలంలోని కలిగుండం అనే గిరిజన పల్లెలో విషాదం చోటు చేసుకుంది. భార్య, భర్తల మధ్య చెలరేగిన మనస్పర్థలు వారి బలన్మరణానికి కారణమయ్యాయి. భర్త కొట్టాడని భార్య ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిని తట్టుకోలేక భర్త కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలాఉన్నాయి. భార్యాభర్తలైన కుంజా భద్రయ్య(70), కుంజా సమ్మక్క(65)బంధువుల ఇంట్లో జరిగిన దినకార్యానికి వెళ్లి ఇంటికి తిరిగివచ్చారు. తనకు భోజనం పెట్టమని భార్య సమ్మక్కను భర్త భద్రయ్య కోరగా నువ్వే పెట్టుకుని తినమని భార్య చెప్పింది. దీంతో ఆగ్రహించిన భద్రయ్య భార్యను కర్రతో కొట్టడంతో ఆమె మనస్తాపానికి గురైంది. ఇంట్లోని పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతిని తట్టుకోలేని భర్త భద్రయ్య కూడా పురుగు మందు సేవించి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో అతనిని సమీపంలోని ఏడుగురాళ్లపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

పాడేరు ఘాట్‌లో షూటింగ్ సందడి



ఎస్‌ఐతో మాట్లాడుతున్న శ్రీకాంత్, షూటింగ్‌లో భాగంగా జీపులో ప్రయాణిస్తున్న హీరో హీరోయిన్లు

- మోదాపల్లిలో హీరో శ్రీకాంత్, వర్ధమాన నటులతో సన్నివేశాల చిత్రీకరణ

సాక్షి,పాడేరు: గీతా ఆర్ట్స్ పతాకంపై జీఏ-2 పిక్చర్స్ నిర్మిస్తున్న సినిమా షూటింగ్ పాడేరు ఘాట్‌లో రెండు రోజుల నుంచి చురుగ్గా జరుగుతోంది. ప్రముఖ సీనియర్ హీరో శ్రీకాంత్, వర్ధమాన హీరో, హీరోయిన్లు రాహుల్ విజయ్, వరలక్ష్మి శరత్‌కుమార్, శివాని రాజశేఖర్‌లతో పలు సన్నివేశాలను వర్ధమాన దర్శకుడు తేజ మార్ని చిత్రీకరించారు. ఆదివాసీ గ్రామం మోదాపల్లి, మోదకొండమ్మతల్లి గుడి వెనుక అటవీ ప్రాంతం, పోతురాజుస్వామి గుడి వెనుక కాఫీతోట్లో మంగళవారం సాయంత్రం వరకు పలు సన్నివేశారు చిత్రీకరించారు. వరలక్ష్మి శరత్‌కుమార్ ఇటీవల విడుదలైన వీరసింహారెడ్డి సినిమాలో బాలకృష్ణ చెల్లెలుగా ప్రతినాయక పాత్ర పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.అయితే ఇంకా పేరు పెట్టని ఈ సినిమాలో కూడా వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పోలీసు అధికారి పాత్రలో నటిస్తున్నారు. మరో హీరోగా నటిస్తున్న రాహుల్ విజయ్ ఫైట్‌మాస్టర్ విజయ్ కుమారుడు. హీరోయిన్ శివాని సినీనటులు జీవిత–రాజశేఖర్‌ల కుమార్తె. ఈ ముగ్గురిపై మోదాపల్లి గ్రామంలో కీలక సన్నివేశాల షూటింగ్ జరిగింది. కొద్ది రోజుల పాటు పాడేరు ప్రాంతంలో సన్నివేశాలు చిత్రీకరిస్తామని చిత్ర యూనిట్ ప్రతినిధులు తెలిపారు. మోదాపల్లి, పాడేరు ఘాట్‌లో సినిమా షూటింగ్ జరుగుతుండడంతో పాడేరు ఎస్‌ఐ రంజిత్ కుమార్, ఇతర సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. హీరో శ్రీకాంత్, ఇతర వర్ధమాన నటీనటులతో సెల్ఫీలు దిగేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

అవిగో ఆర్థిక సంఘం నిధులు!

- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.8.50 కోట్లు విడుదల
- 42 జెడ్పీటీసీలు, 13 ఎమ్మెల్యేలు..
- వీరికి రూ.13 లక్షల చొప్పున కేటాయింపు
- ఈ నిధులతో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ పనులు
- అంచనాల తయారీలో అధికారులు
- రూ.కోటితో జెడ్పీ కార్యాలయం, గెస్ట్‌రూమ్‌లకు మరమ్మతులు



విశాఖ జెడ్పీ కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: కొన్నాళ్లుగా ఊరిస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.8.50 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను జిల్లా పరిషత్ పరిధిలోకి వచ్చే 42 మంది జెడ్పీటీసీలు, 13 మంది ఎమ్మెల్యేలకు రూ.13 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని మంచినీరు, సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, డ్రెయినేజీలకు అవసరమైన పనులు చేపట్టనున్నారు. ఇంకా ఎక్కడైనా అవసరమైతే కొత్తగా రోడ్ల నిర్మాణానికి కూడా వెచ్చించనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల సమాచారాన్ని జిల్లా పరిషత్ అధికారులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవోల)కు పంపించారు. ఈ ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సదరు పనులకు అంచనాల తయారీలో ఉన్నారు. నిబంధనల ప్రకారం అంచనాలు రూపొందించి పంపిస్తారు. అనంతరం పనులు చేపడతారు. ఈ పనులు మొదలైతే మార్చి నాటికల్లా పూర్తవుతాయని భావిస్తున్నారు.

జెడ్పీ కార్యాలయానికి మరమ్మతులు

మరోవైపు జిల్లా పరిషత్ కార్యాలయం, ఆ ప్రాంగణంలో ఉన్న ఎనిమిది గెస్ట్ రూమ్‌లు చాన్నాళ్లుగా మరమ్మతులకు గురయ్యాయి. ఈ గెస్ట్ రూమ్‌లు చాలా వరకు వినియోగానికి పనికి రాకుండా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో జెడ్పీ కార్యాలయం, గెస్ట్ రూమ్‌లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నట్టు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర 'సాక్షి'తో చెప్పారు.

జనరల్ ఫండ్ నుంచి రూ.12 కోట్లు

ఇప్పటికే గత ఏడాది జిల్లా పరిషత్ సాధారణ నిధుల (జనరల్ ఫండ్) నుంచి జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలకు రూ.12 కోట్లు విడుదల చేశారు. ఇలా జెడ్పీటీసీలకు రూ.15 లక్షలు, ఎమ్మెల్యేలకు రూ.50.20 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. తాజాగా ఇప్పుడు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో అవసరమైన పనులు చేపట్టడానికి సన్నద్ధమవుతున్నారు.

జీలుగు కల్లు తాగి నలుగురికి అస్వస్థత

- ఒకరి మృతి



లోవరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చింతపల్లి: గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ ఆకులూరుకు చెందిన నలుగురు గిరిజనులు సోమవారం జీలుగు కల్లు తాగి అస్వస్థతకు గురయ్యారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరిలో ఒకరు మంగళవారం మృతి చెందాడు. ఆకులూరుకు చెందిన పాంగి లోవరాజు (30), పాంగి రామదాసు (50), కొర్రా దానిమ్మ (50), కొర్రా బొందు (26) సోమవారం గ్రామంలో ఒక వ్యక్తి వద్ద జీలుగు కల్లు కొనుక్కొని సేవించారు. కొంత సేపటికి వీరు అస్వస్థతకు గురికావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక పరీక్షల అనంతరం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూనే లోవరాజు అనే వ్యక్తి మృతి చెందాడు. మిగతా ముగ్గురిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు లోవరాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీలుగు కల్లులో ప్రమాదకర పదార్థాలు కలవడం వల్ల అస్వస్థతకు గురై ఉంటారని వైద్య సిబ్బంది తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



హాజరైన గ్రామ వలంటీర్లు, గృహ సారథులు,కన్వీనర్లు, మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో నియోజక వర్గ పరిశీలకుడు కొండలరావు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- డుంబ్రిగుడలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' సదస్సు

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందిస్తున్న గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికులు మీరే అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు నియోజక వర్గ పరిశీలకుడు కొండలరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయలేనిని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వీటిని అందించడంలో గ్రామ వలంటీర్లు, ప్రధానంగా పని చేస్తున్నారని వీరికి తోడుగా గృహ సారథులు, సచివాలయయ కన్వీనర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. గిరిజన ప్రాంతంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయంపై గృహ సారథులు ఇంటింటికి వెళ్లి తెలుసుకుని సంక్షేమ పథకాలు అందుతున్న వారిని గుర్తించాలని కోరారు. ప్రతిఒక్కరూ సైనికులల్లా పనిచేసి మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలని పిలుపునిచ్చారు. అరకు నియోజకవర్గంలో సొంత నిధులతో గర్భిణులకు హాస్టల్, అంబులెన్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం తన దృష్టికి తీసుకువస్తే వారికి ఆదుకుంటామని ఆయన అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో 175 సీట్లు విజయం ఖాయమన్నారు. ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజక వర్గ పరిశీలకుడు కొండలరావు, రాష్ట్ర యువజన విభాగం వైఎస్సార్‌సీపీ కార్యదర్శి చెట్టి వినయ్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి శెట్టి గంగధర స్వామి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, మహిళా విభాగం అధ్యక్షురాలు శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్‌లు వెంకటరావు,నాగేశ్వరరావు, జగ్గునాయుడు, ఎంపీటీసీలు, మండల సచివాలయ కన్వీనర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి శివరాత్రి ఉత్సవాలు

- మత్స్యగుండంలో మూడురోజుల జాతర
- విజయవంతం చేయాలి
- పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ ఆదేశాలు



సాక్షి,పాడేరు: మత్స్యగుండంలో ఈనెల 17 నుంచి జరగనున్న శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ ఆదేశించారు.ఉత్సవాలకు సంబంధించి మంగళవారం తన కార్యాలయంలోని సమావేశమందిరంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 17,18,19 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా రెండు ట్యాంకులతో సురక్షిత తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. అంతేకాకుండా కుళాయిల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మత్స్యగుండం సీలయేరు ప్రాంతంలో వారం రోజుల పాటు దుస్తులు ఉతకడాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటించారు. మత్స్యగెడ్డలో ప్రమాద హెచ్చరిక బోర్డులతో పాటు, ఆలయ ప్రాంగణంలో 75 చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శివరాత్రి ఉత్సవాల సమయంలో మూడు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిరంతరం వైద్యశిబిరాలు

జాతరకు వచ్చే అన్ని వర్గాల భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించారు. 24 గంటలు పనిచేసేలా మూడు రోజులు నిర్వహించాలని సూచించారు. రెండు అంబులెన్సులు, పూర్తిస్థాయిలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పగలు మహిళా వైద్యసిబ్బందికి, రాత్రి సమయంలో పురుషులకు వైద్యశిబిరాల డ్యూటీలు వేయాలని ఆదేశించారు.

కట్టుదిట్టంగా బందోబస్తు

మత్స్యగుండంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 220 మంది పోలీసులు,10మంది ఎస్‌ఐలతో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ పోలీసుశాఖను ఆదేశించారు. మహిళలు మత్స్యగెడ్డలో స్నానాలు చేసే చోట మహిళా పోలీసులను విధుల్లో నియమించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో భక్తులు స్నానాలు చేయకుండా తగిన జాగ్రత్తలు చేపట్టడమే కాకుండా, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గజ ఈతగాళ్లను మత్స్యగెడ్డ సీలయేరు ప్రాంతంలో అందుబాటులో ఉంచాలన్నారు. మత్స్యగుండం ప్రాంతంలో మద్య నిషేధం అమలుజేయడమే కాకుండా, కార్లు, బైక్‌లకు పార్కింగ్‌ఏర్పాటు చేయాలని సూచించారు. భారీ వాహనాలను ఉత్సవ ప్రాంగణానికి రాకుండా అడ్డుకోవాలని ఆదేశించారు. ఉత్సవాల్లో 250 స్టాళ్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. జీసీసీ ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా 15 ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. హుకుంపేట తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్, వీఆర్ ఈఈ కొండయ్యపడాల్, జీసీసీ డీఎం పార్వతమ్మ, ఆర్టీసీ డీఎం ఆర్.ఎస్.నాయుడు, సీడీపీవో శ్రీదేవి, సర్పంచ్ మఠం శాంతికుమారి, ఉత్సవ,ఆలయ కమిటీ ప్రతినిధులు మఠం సింహాచలంనాయుడు, మినుముల గోపాలపాత్రుడు, మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలు

- సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రంజిత్ కుమార్ బలగోత్ర
- రూడకోటలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహణ



రూడకోటలో గిరిజనులతో సీఆర్‌పీఎఫ్ అధికారులు

పెదబయలు: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పోలీసులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రంజిత్‌కుమార్ బలగోత్ర అన్నారు. మంగళవారం మండలంలోని రూడకోట గ్రామంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్‌పీఫ్ జి/198 బెటాలియన్ ఆధ్వర్యంలో పేద గిరిజనులు, వృద్ధులకు 120 మందికి రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ పోలీసులు సామాజిక సేవల్లో భాగంగా గిరిజనులకు సహకారం అందిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ,పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు. గతంలో మారుమూల గ్రామాలకు వెళ్లినప్పుడు పోలీసులకు దూరంగా ఉండేవారని, ఇప్పుడు పోలీసు స్టేషన్‌కు వచ్చి సేవలు పొందే దిశగా వారిలో మార్పు వచ్చిందన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పన జరుగుతోందన్నారు. సెల్ టవర్ల నిర్మాణం జరుగుతుందన్నారు. చదువుకున్న గిరి యువతకు ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాల కోసం అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి రూడకోట సర్పంచ్ కాతారి సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్ పండా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

- 17 మందికి షోకాజ్ నోటీసులు
- జారీ చేసిన డీఈవో రమేష్

డుంబ్రిగుడ: విద్యాబోధన విషయంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై డీఈవో రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పరిడి, డుంబ్రిగుడ, కిల్లోగుడ, అరకు ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం 8వతరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల వినియోగం అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ముందుగా అవగాహన పొందాలని సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఆయన నాడు–నేడు పనులు సక్రమంగా జరగకపోవడంపై హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నాడు–నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఉపాధ్యాయులు లెసన్‌ప్లాన్ లేకుండా విద్యార్థులకు ఎలా బోధన చేస్తున్నారని ప్రశ్నించారు. లెసన్ ప్లాన్ తయారీకి ప్రభుత్వం పంపిణీ చేసిన నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులు వినియోగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా 17 మందికి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధినిరోధకశక్తి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

డుంబ్రిగుడ: చిన్నారులకు తల్లిపాలతోనే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముర్రిపాలు పెట్టడం వలన చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆయన అన్నారు.అలాగే బాల్యవివాహాలను విడనాలని గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాంబాబు,ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో మంగళవారం సాయంత్రం ఆటో బోల్తాపడి ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వై.రామవరం మండలం డొంకరాయి గ్రామానికి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు ఆటోలో రాజమహేంద్రవరం బయలుదేరారు. మండలంలోని వాలమూరు సమీపంలోని ఘాట్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కె. సోని, కె. మంగి అనే ఇద్దరికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

2,500 లీటర్ల పులుపు ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో పోలీసులు

కొయ్యూరు: మండలంలోని నల్లగొండ పంచాయతీ కొప్పుకొండ శివారులో సారా బట్టీలపై సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. 2,500 లీటర్ల పులుపును ధ్వంసం చేశారు. వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కొప్పుకొండ శివారులో సారా తయారీపై అందిన ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు సీఐ తెలిపారు. ఆయన ఎస్‌ఐ రాజారావుతో కలిసి వెళ్లే సరికి తమ రాకను గమనించిన తయారీదారులు పరారయ్యారని ఆయన వివరించారు. వెంటనే పులుపును ధ్వంసం చేసినట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో సారా తయారీ అనర్థాలపై అవగాహన కల్పించారు. సారా తయారు చేసినా, విక్రయించినా ఏడేళ్ల జైలు పడుతుందన్నారు. సారా తయారీకి స్వస్తి చెప్పకుంటే ఇక నుంచి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

మెటీరియల్ సరఫరాకు టెండర్ల ప్రక్రియ


టెండర్లను తెరుస్తున్న ఐటీడీఏ అధికారులు

చింతూరు: కొండరెడ్ల గ్రామాలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో భాగంగా కావాల్సిన వస్తువులకు మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే సమక్షంలో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో కొండలపై నివసిస్తున్న కొండరెడ్ల కుటుంబాలకు ఇంటి పైకప్పు రేకులు, సోలార్ లాంతర్లు, ఐరన్ రేకుల సరఫరా నిమిత్తం టెండర్లు పిలిచారు. ఐదు వేల ఇంటి పైకప్పు రేకులకు సంబంధించి ఐదు టెండర్లు, రెండు వేల సోలార్ లాంతర్లకు ఐదు, 4,500 ఐరన్ రేకులకు నాలుగు టెండర్లు దాఖలయ్యాయి. చింతూరు ఏరియా ఆస్పత్రి, కూనవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు ఆహారం సరఫరా నిమిత్తం ఒక్క టెండరు కూడా దాఖలు కాలేదు. దాఖలైన టెండర్లను వారి సమక్షంలో తెరచిన అధికారులు వాటిని ఖరారు చేయాల్సి ఉంది.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ విద్యార్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు నేరుగా కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి పనుల్లో నిధుల దుర్వినియోగం

- ప్రజావేదికలో వెల్లడి
- రూ.51.96కోట్ల పనులపై ఆడిట్
- రికార్డుల అస్తవ్యస్త నిర్వహణపై డ్వామా పీడీ అసంతృప్తి


ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డ్వామా పీడీ రమేష్‌రామన్ ఆధ్వర్యంలో మండలంలోని 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో రూ.51.96 కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పనుల వివరాలను పలువురు వెల్లడించారు. ఇందులో భాగంగా నిధుల దుర్వినియోగం, బినామీ మస్తర్లు తదితర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో యూ. చీడిపాలెం పంచాయతీలో మర్రిపాకల, జెర్రిగొంధి, గంగవరం, నీలవరం ప్రాంతాల్లో మినహా ఇతర గ్రామాల్లో ఎకరాకు 900 కాఫీ మొక్కలు చొప్పున 90 ఎకరాలకు పంపిణీ చేశారు. ఇందుకోసం రూ.18 లక్షలు ఖర్చు చేశారు. అయితే 65 శాతం మొక్కలు చనిపోయాయని, ఈ కారణంగా నిధులు నిరుపయోగమైనట్టు అధికారులు వెల్లడించారు. ఆడాకులలో నూకరాజు అనే వ్యక్తి 2016లో చనిపోయారు. అయినా అతని పేరిట నేటికీ ఉపాధి పనుల్లో మస్తర్ వేస్తున్నారని, ఇలా బినామీ పేర్లతో నిధులు పక్కదారి పడుతున్నాయని డీఆర్పీ ఆదినారాయణ వివరించారు. జాబితాకు భిన్నంగా జాబ్‌కార్డులున్నట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ మాట్లాడుతూ ఐదేళ్ల కిందట చేపట్టిన ఉపాధి పనుల బోర్డులను నేటికీ చూపించి మోసం చేస్తున్నారని వివరించారు. టీఏల సంతకాలు లేకుండానే నిధులు చెల్లించినట్టు తెలిపారు. ప్రతీ పంచాయతీ ఉపాధి పనులపై నిర్వహించాల్సిన ఏడు రకాల రిజిస్టర్లు సక్రమంగా లేనట్టు తనిఖీల్లో బయటపడింది. పలు ప్రాంతాల్లో వీఆర్పీలు పంచాయతీల్లో చేసిన ఆడిట్‌లో రికార్డుల నిర్వహణ లేనట్టు వివరించారు. ఈ విషయంపై డ్వామా పీడీ రమేష్ రామన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వీఆర్పీల నుంచి రికవరీపై జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మల దేవి నివేదిక సిద్ధం చేశారు. ఆడిట్‌కు గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం నుంచి రికార్డులు అందజేయకపోవడంతో ఆ శాఖ ఈఈకి లేఖ రాస్తామని పీడీ రమేష్‌రామన్ స్పష్టం చేశారు. చింతపల్లి క్లస్టర్ ఏపీడీ రామారావు, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, ఎంపీడీవో మేరీరోజ్, ఏపీవో రాజు, ఎంపీటీసీ సభ్యుడు బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా అధికారులు పొల్లూరు జలపాతం సందర్శన

మోతుగూడెం: ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాల గిరిజనుల ముఖ్య పండుగ ముత్యాలమ్మ తల్లి (బడాయాత్ర) జాతర ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో ఒడిశాకు చెందిన మల్కనగిరి సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్, అడిషనల్ ఎస్పీబలభద్ర, ఇంటెలిజెన్సీ డీఎస్పీ జోథానల్ బృందం మంగళవారం పొల్లూరు జలపాతాన్ని సందర్శించారు. జాతరకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున జలపాతం వద్ద ఏర్పాట్లు, సీలేరు నది వద్ద అమ్మవారు పడవ దాటే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వారంలో చింతూరు ఐటీడీఏలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ అధికారులు, జెన్‌కో అధికారులతో మాట్లాడిజాతర ఏర్పాట్లపై కార్యాచరణ తెలియజేస్తామన్నారు. సీలేరు నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు ఏడాదిలోగా పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు. వారిని మర్యాదపూర్వకంగా చింతూరు ఎంపీడీవో రవిబాబు, సర్పంచ్ ఆకేటి సీత, కార్యదర్శి రవినాయక్, మోతుగూడెం, పొల్లూరు జాతర కమిటీ సభ్యులు మల్లికార్జున, వరప్రసాద్, జెన్‌కో ఉద్యోగులు సూరిశెట్టి నాయుడు, కల్లా రామకృష్ణ, కరణం శ్రీనుబాబు కలిశారు.

పొల్లూరు శివాలయంలో వారిని బృందం అధికారులను సత్కరించారు. మల్కనగిరి, కలిమెల తహసీల్దార్లు సబీర్షా తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో యువకుడు గల్లంతు


రిత్విక్ (ఫైల్)

పాయకరావుపేట: మండలంలోని పెద్దూరు సముద్ర తీరంలో స్నానం చేస్తుండగా ఓ యువకుడు గల్లంతైనట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. కాకినాడ మధురానగర్‌కి చెందిన గుమ్మడి రిత్విక్ (24) సోమవారం సాయంత్రం సముద్ర స్నానానికి స్నేహితులతో వెళ్లాడు. స్నానం చేస్తుండగా అలల తాకిడికి మునిగిపోయినట్టు ఎస్ఐ తెలిపారు. రిత్విక్ బీటెక్ చదువుతున్నాడని, రిత్విక్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అడవి బిడ్డలకు కార్పొరేట్ వైద్యం

- విలీన మండలాల్లోని ఆస్పత్రుల్లో విజయవంతంగా శస్త్రచికిత్సలు
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనుల కృతజ్ఞతలు


కూనవరం సీహెచ్‌సీలో ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యులు

కూనవరం: ఎట్టకేలకు విలీన మండలాల్లో శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా కూనవరం, వి.ఆర్.పురం, చింతూరు, ఎటపాక నాలుగు విలీన మండలాల్లో ప్రజల నుంచి హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. కార్పొరేట్ వైద్యాన్ని గిరిజనులకు ఉచితంగా అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పం అమల్లోకి వచ్చిందని అన్ని వర్గాలు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల అనంతరం విలీన ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గతనెల 26న చింతూరు ఏరియా ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా కూనవరం మండలం కోతులగుట్ట 30 పడకల ఆస్పత్రిలో మంగళవారం నలుగురికి నిర్వహించిన శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో జనరల్ ఫిజిషియన్ జానా భాస్కర్, ఎనస్థిషియా డాక్టర్ హర్షవర్ధన్‌లు వివిధ సమస్యలతో బాధపడుతున్న నలుగురు రోగులకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ సర్జన్ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ కూనవరం ప్రభుత్వ ఆస్పత్రిలో(కోతులగుట్ట) క్రమం తప్పకుండా సర్జరీలు జరుగుతాయని తెలిపారు.

బాధ్యతగా ఓటరు నమోదు

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం

పాడేరు రూరల్ : కొత్త ఓటరు నమోదు ప్రక్రియపై బాధ్యతగా చేపట్టాలని, ఈవిషయంలో నిర్లక్షంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి పాడేరు ఏజెన్సీ 11 మండలాల తహసీల్దార్లలో ఓటరు నమోదుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన పౌరలందరికీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఫారం-6 సేకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. హెబిటేషన్ ప్రొఫైల్ ప్రకారం 28 శాతం పీవీటీజీలు ఉన్నారన్నారు. 18 ఏళ్లు నిండిన పీవీటీజీలను తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ప్రధానంగా కోదు, గదబ, పోర్జా గిరిజనుల నమోదు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి గ్రామ సచివాలయ ఉద్యోగుల సేవలను వినియోగించుకొని ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతగిరి మండలం రొంపిలి, దయార్తి గ్రామాలతో పాటు పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల మారుమూల గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఐసీటీసీ విభాగం తనిఖీ

సాక్షి,పాడేరు: ఢిల్లీకి చెందిన జాతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రొఫెసర్,హెడ్ స్టాటిస్టిక్స్ డాక్టర్ పుష్పాంజలి స్వైన్ మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని ఐసీటీసీ విభాగాన్ని తనిఖీ చేశారు. కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన జిల్లా ఆస్పత్రుల్లో హెచ్ఐవీ సర్వైలెన్స్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు పాడేరు జిల్లా ఆస్పత్రిలోని ఐసీటీఎస్ కేంద్రం ద్వారా హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు, కేసుల వివరాలు, బాధితులకు అందిస్తున్న వైద్యం, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆమె సమగ్ర వివరాలు సేకరించారు. టీబీ, కుష్టు నివారణ విభాగం జిల్లా అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరరావు, జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కె.కృష్ణారావు ఐసీటీఎస్ కేంద్రం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు.హెచ్ఐవీ సర్వైలెన్స్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న వైద్యబృందాలను డాక్టర్ పుష్పాంజలి స్వైన్ అభినందించారు.

పోస్టల్ సేవలపై అవగాహన


ఐటీడీఏ పీవో గోపాలకృష్ణకు పోస్టల్ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఐపీవో ఉపేంద్ర

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో తపాలా శాఖలో పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ అన్నారు.అరకు తపాలాశాఖ సబ్ డివిజన్ ఐపీవో బి.ఉపేంద్ర మంగళవారం ఐటీడీఏ పీవో గోపాలకృష్ణను కలిసి తపాలాశాఖ పథకాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా పథకాలకు సంబంధించిన కరపత్రాన్ని పీవోకు అందజేశారు. హుకుంపేట, పెదబయలు సబ్ పోస్టాఫీసుల్లో వసతి, తాగునీటి సమస్యలను పీవోకు వివరించారు. దీనికి స్పందించిన పివో గోపాలకృష్ణ మాట్లాడుతూ తపాలాశాఖ సేవలపై ఈ నెల 10న ఉద్యోగుల సమవేశంలో పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామస్థాయిలో విస్తృత ప్రచారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తపాలా సేవల విస్తరణకు,సౌకర్యాలు కల్పనకు ఐటీడీఏ నుంచి సహకారం అందిస్తామని పీవో గోపాలకృష్ణ చెప్పారు.

కుష్టువ్యాధిపై అవగాహన కల్పించాలి

- కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారుల సూచన


'స్పర్శ' అక్షర ఆకృతిలో ఆశా కార్యకర్తల ప్రదర్శన

హుకుంపేట: కుష్టు వ్యాధి నివారణపై గ్రామాల్లోని గిరిజనులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని ఉప్ప ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారులు డా.అనుషా, డా.ప్రశాంత్ సూచించారు. మంగళవారం మండలంలోని ఉప్ప ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో స్పర్శ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు 'స్పర్శ' అక్షర ఆకృతిలో చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఈనెల 13 వరకు కొనసాగుతాయని వైద్యాధికారులు తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు


పోటీలో తలపడిన యానాం, శ్రీకాకుళం జట్లు


వాలీబాల్ క్రీడాకారులతో సీఐ

చోడవరం రూరల్: మండలంలోని గోవాడలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఇక్కడ పరదేశమ్మ పండగ సందర్భంగా గోవాడ, అంబేరుపురం స్ట్రామ్ బోయ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను మంగళవారం చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి పండగ, తీర్థాల్లో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల జట్లతోపాటు పాండిచ్చేరి జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ బి.అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు, గోవాడ మాజీ సర్పంచ్ ఏడువాక వెంకట లక్ష్మణకుమార్ తదితరులు క్రీడాకారులను అభినందించారు. ప్రారంభ పోటీలో యానాంపై శ్రీకాకుళం జిల్లా జట్టు విజేతగా నిలిచింది.

దట్టంగా పొగమంచు


మన్యంలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు మంచుతెరలు వీడడం లేదు. మంగళవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 9.5, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 9.4, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. - సాక్షి,పాడేరు

వీఆర్పీ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి లేఖ


పీడీ రమేష్‌రామన్

కొయ్యూరు: జిల్లాలో 22 మండలాల్లో దాదాపుగా 200 వీఆర్పీ పోస్టుల భర్తీకి పంచాయతీరాజ్ కమిషనర్‌కు లేఖ రాశామని డ్వామా పీడీ రమేష్ రామన్ వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉపాధిహామీ ప్రజా వేదికకు విచ్చేశారు.ఈ సందర్భంఆ విలేకరులతో మాట్లాడారు. క్రమబద్ధీకరణలో రాష్ట్రానికి సంబంధించి 400 వరకు వీఆర్పీ పోస్టులు మిగిలాయన్నారు. వాటిని సర్దుబాటు చేయడం లేదా కొత్త వారి నియామకానికి ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు.

ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. 2023-24కు సంబంధించి జిల్లాలో 1.5 కోట్ల పనిదినాల లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2022-23లో 1.18 కోట్ల పనిదినాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు కోటి పనిదినాలు కల్పించామని చెప్పారు. మార్చి నాటికి మిగిలిన వాటిని పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లాకు మొత్తం రూ.400 కోట్లు కేటాయించగా దీనిలో రూ.150 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్‌కు వెళ్లాయన్నారు. జిల్లాలో 2.16 లక్షల మంది జాబ్‌కార్డుదారులు ఉన్నారన్నారు. నియోజకవర్గానికి 500 బోర్లు రైతులకు వేయాల్సి ఉండగా వీటిలో కొయ్యూరులో 58, చింతపల్లిలో 38 వేశారని తెలిపారు. మిగిలిన వాటి పనులు త్వరలో ప్రారంభిస్తారని ఆయన వివరించారు. మన్యంలో తోటల పెంపకాన్ని మూడు నుంచి నాలుగు వేల ఎకరాలకు పరిమితం చేశారన్నారు. కొయ్యూరుకు సంబంధించి జీడి, నిమ్మ, సపోట, చింత, మునగ, సీతాఫలం వేసుకోవచ్చని వివరించారు. చింతపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసుకోవచ్చునన్నారు. ఈ సారి రైతులు నేరుగా మొక్కలను కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటే దానికి డబ్బులు చెల్లిస్తామన్నారు. జిల్లాలో 30 శాతం మాత్రమే ఎన్ఎంఎంఎస్ నమోదు జరుగుతుందన్నారు. 430 పంచాయతీలకు సంబంధించి 2,300 గ్రామాల్లో నెట్‌వర్క్ లేదన్నారు. ఈ విషయాన్ని పీఆర్ కమిషనర్‌కు నివేదించగా ఎన్ఎంఎంఎస్ లేకపోయినా పనులు చేసేందుకు అనుమతి ఇచ్చారని పీడీ పేర్కొన్నారు.

చెరకు రైతులకు మేలు చేసేలా పరిశోధనలు

- సోలాపూర్ మహాత్మాపూలే కృషి విద్యాపీఠం(ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు
- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌ను సందర్శించిన బృందం


బెల్లం పొడర్ యంత్రాన్ని పరిశీలిస్తున్న సోలాపూర్ శాస్త్రవేత్తలు

అనకాపల్లిటౌన్: చెరకు రైతులకు మేలు జరిగే విధంగా పలు రకాల పరిశోధనలు చేస్తున్నట్టు మహారాష్ట్ర రాష్ట్రంలో సోలాపూర్ మహాత్మాపూలే కృషి విద్యాపీఠం(ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, గోవింద్, బాపూరావ్ గైక్వాడ్ తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానాన్ని మంగళవారం వారు సందర్శించి, బెల్లంతయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపొడిని తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించినట్టు చెప్పారు. సోలాపూర్ పరిశోధనా కేంద్రంలో రూ.2.16 కోట్లతో మోడరన్ జాగ్రి ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా బెల్లం పొడర్, లిక్విడ్ బెల్లాన్ని అధికంగా తయారు చేస్తూ ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు తెలిపారు. లిక్విడ్ బెల్లం సుమారు పది నెలలు, బెల్లం పొడర్ ఏడాది పాటు నిల్వ ఉంటుందన్నారు. మహారాష్ట్రలో కోఆపరేటివ్ సంస్థలు 177 ఉన్నాయని వారు చెప్పారు. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో సూపర్‌కాన్ హార్వెస్టర్ అనే కొత్త యంత్రాన్ని రూ.1.20 కోట్ల వ్యయంతో తయారు చేశారని, గతంలో అక్కడి యంత్రాలను తాము పరిశీలించామని చెప్పారు. బెల్లం సీజన్ నవంబర్ నుంచి మార్చి వరకూ ఉంటుందని, ఈ సీజన్‌లో తయారు చేసే బెల్లాన్ని ఏడాది పాటు నిల్వ ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్రలో ఎకరాకు 50 టన్నుల చెరకు దిగుబడి అవుతుండగా, ఏపీలో 25 నుంచి 30 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోందన్నారు. వీరితో పాటు అనకాపల్లి మోడరన్ జాగ్రిప్లాంట్‌ను ముంబై ఐఐటీ శాస్త్రవేత్తలు ప్రమోద్‌గడ్కరీ, విశ్వంబర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ దేశంలో బెల్లం ఉత్పత్తి ప్రథమస్థానంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉందని, తర్వాత స్థానంలో ఏపీ ఉన్నట్టు చెప్పారు.

జేఈఈ మెయిన్స్‌లో లక్ష్మీశౌర్య ప్రతిభ


కుటుంబ సభ్యులతో లక్ష్మీశౌర్య


ఎన్.సూర్యచరణ్


ఎస్.అశోక్


జి.శిరీషా

చోడవరం రూరల్/మాడుగుల రూరల్ : తల్లి సాధారణ గృహిణి, తండ్రి వ్యవసాయంతో పాటు చిన్నపాటి కలప వ్యాపారం చేస్తుంటాడు. అయితేనేమి చదువులో తాను ఆణిముత్యమని నిరూపించాడు ఆ గ్రామీణ విద్యార్థి. తన అక్క మెడిసిన్‌లో ఉత్తమ ర్యాంకుతో ఆంధ్రా మెడికల్ కళాశాలలో సీటు సాధించడాన్ని స్ఫూర్తిగా తీసుకుని తాను ఇంజనీరింగ్‌లో దేశ వ్యాప్తంగా మెరుగైన ఫలితాన్ని సొంతం చేసుకున్నాడు. వి.మాడుగుల మండలం కస్పా జగన్నాథపురానికి చెందిన కాళ్ల చినఅప్పలనాయుడు, ఉదయశ్రీ దంపతులు ప్రస్తుతం పట్టణ పరిధిలోని మారుతీనగర్‌లో నివసిస్తున్నారు. వీరి కుమారుడు లక్ష్మీశౌర్య 2023 విద్యాసంత్సరానికి జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)లో బీటెక్ ప్రవేశ పరీక్షలో ఎన్‌టీఏ స్కోర్ 99.96 సాధించి సత్తా చాటాడు. లక్ష్మీశౌర్య పాఠశాల స్థాయి నుంచే చదువులో ముందుండేవాడు. దీంతో గుంటూరులోని భాష్యం విద్యాసంస్థలో ఆరో తరగతిలో చేర్పించారు. అదే సంస్థలో ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఐఐటీలో చేరి ఇంజినీరింగ్ చేయాలన్న తన లక్ష్య సాధనకు జేఈఈ ఎంట్రెన్స్‌లో 99.9616260 ఎన్‌టీఏ స్కోర్‌ను సాధించాడు. జాతీయస్థాయిలో జనరల్‌లో 100లోపు ర్యాంకు ఉంటుందని అంచనా. తన అక్క లక్ష్మీ హర్షిణి ఎంబీబీఎస్‌లో మంచి ర్యాంకుతో విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో సీటు సాధించిందని, ఆ స్ఫూర్తితోనే తాను కూడా మంచి ర్యాంకుతో ఐఐటీ సీటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని చదివినట్టు తెలిపాడు. లక్ష్మీశౌర్యను విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట : జేఈఈ మెయిన్స్ ఫేజ్-1 ఫలితాల్లో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్.సూర్యచరణ్ 99.69, ఎస్.అశోక్ 96.79, జి.శిరీషా 96.79 పర్సంటైల్‌తో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో జేఈఈ మెయిన్స్ కోసం ఇస్తున్న ఇంటిగ్రేడెట్ కోచింగ్ ద్వారా ఈ విజయాన్ని సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థుల్లో 10 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకి అర్హత పొందినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంస్థ అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సహచర విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లిటౌన్ : టాటా ఏస్ వ్యాన్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దివాకర్ తెలిపారు. వివరాలు.. పట్టణంలోని గవరపాలెం సత్తెమ్మ తల్లి ఆర్చ్ వద్ద పట్టణ పౌర సరఫరాల శాఖ ఆర్ఐ ఈశ్వరరావు మంగళవారం రాత్రి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులకు అప్పగించారు. వ్యాన్, వ్యాన్‌లో ఉన్న 1,400 కిలోల రేషన్ బియ్యంను స్వాధీన చేసుకున్నారు. ఆర్ఐ ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.